

# కథ అడ్డంగా తిరిగింది

శ్రీ మొదలి వేంకట సుబ్రహ్మణ్య శర్మ

మంచి చిటికెడుపొడుము ముక్కులోకి ఎక్కిస్తూ విశ్వనాథం త్రోవన పోతూవుంటే, స్నేహితుడు ఎదురయినాడు. అప్పుడే ఎవరితోనో మాట్లాడి వస్తున్నాడేమో ఇతన్ని చూడగానే విశ్వనాథం "ఇన్నాళ్లు పెళ్లిచెయ్యకుండా ఉంచితే ఏమవుతుంది?" అన్నాడు.

"ఏమిటి అది"

"ఏముంది? నారాయణగారింట్లో సంగతే"

"ఏమయిందేం"

"ఇంకా ఏంగావాలె? వాళ్లపిల్ల శాంతకాస్తా రజస్వల అయిందట"

"నిజంగానా? ఎప్పుడూ"

"రెండుమూడు నెలలయింది. ఇన్నాళ్లనుంచీ దాచేశారు"

"ఏమిటీ, ఇప్పుడెలా తెలిసిందీ"

"ఈలాంటి సంగతులు దాగుతయ్యా? ఆనోట ఆనోట నాచెవిని బడ్డది. ఇదివరకే సగం ఊరికి తెలిసిందట"

"నేను వినలేదే"

ఈసంగతి సగం ఊరికి తెలిసిందనడంలో కాలభేదం మాత్రమే గనుక విశ్వనాథంగారి మీద అబద్ధం ఆరోపించవలసిందేమీ లేదు. "సగం ఊరికి తెలుస్తుంది" అనడానికి బదులు "సగం ఊరికి తెలిసింది" అన్నాడు.

అసలు ఈపుకారు లేవదీసిందే విశ్వనాథంగారు. ఆయన మనస్సులో ఈలాంటి ఆలోచనలు పుష్కలంగా ప్రతిదినమూ ఉద్భవిస్తూనే ఉంటయి. ఆకుక్క గొడుగులలో ఇదొకటి, వెంటనే స్నేహితుడు కనబడేప్పుడు ఆమాటా, ఆమాటా కాగానే "నారాయణ కూతురి సంబంధం స్థిరపడలేదటోనా?" అన్నాడు.

"ఇంకా లేదల్లే ఉంది. ఇందాక కనపడ్డాడు. ఏదన్నా ఉంటే చెప్పడూ"

"ఏమోనబ్బా! ఎవరువచ్చి తింగి పోతున్నారో పాపం!"

"ఏమో మనకేం తెలుస్తుంది"

"ఏదో ఉందటలే"

"ఏమిటి"

"మనకెందుకు లేవోయ్! తెలిసిందంటే మనం కావించామని మనను తిడతారు"

"మననెందుకు తిడతారయ్యా? విషయం చెప్పక"

"ఏమీ లేదు. ఆపిల్ల రజస్వలా అయిందట. తెలిసే అందరూ వెనక్కు తిరిగిపోతున్నారుట"

"ఛీ! పాపకర్మపుమాట లనక. పసిపిల్ల కాదటయ్యా అది?

"ఏమోనబ్బా! వినడమూ అలాగే విన్నాను. నాకూ అలాగే తోచింది. నిజం దేవుడికి తెలియాలి.

"పట్టిఅబద్ధం"

"అంతగా ఓట్రించడం మాత్రం మనకెందుకు ఏమో అయివుండకూడదా? నీకూ నాకూ తెలియాలెనా"

"ఊహేనంటావా? ఎవరన్నా చెప్పారా"

"నాకు నమ్మకయిన వాళ్లే చెప్పారు. ఇహ తావా?

ఈలా ప్రారంభమయిన పుకారు ఇద్దరు దాటి మూడోవాడి దగ్గరకు వచ్చేసరికి "సగం ఊరికి తెలిసింది."

పల్లెటూళ్లలో పనే ఉండదు. ఉన్న పనిచేస్తూ కాగానే నలుగురూ ఒకచోట చేరడం, ఉన్నవీ లేనివీ కలిసి కథలు

అల్లడం; పుట్టమీదివీ పురంమీదివీ పురాణాలు ఏకరువు పెట్టడం, ఇదీ పని.

అది కారణంగా విశ్వనాథంగారు నాటిన విత్తనం మూడో నాటికి ఫలించింది. ఆయన చెప్పినట్లే మూడో నాటికి ఆమాట ఊరంతా పాకిపోయింది.

అందువల్ల నారాయణగారి కుమార్తె వివాహ విషయమే ప్రతివాడి నాలుకమీదా ఆడడ మారంభించింది. ఊరంతా ఇలా అట్టుడికినట్లు ఉడికిపోయే సందర్భంలోనే నారాయణగారి కుమార్తెకు బెజవాడనుంచి చక్కని సంబంధం ఒకటి వచ్చింది,

పెళ్లివారు పెళ్లికూతురు చూపులకు వచ్చిరాక మునుపే వారిని గురించిన యావత్తు భోగట్టా ఊరివారి పరమయింది. అందరూ దానికి చిలవలు పలవలు కల్పించి చెప్పుకుంటున్నారు. పెళ్లికొడుకు బి.ఏ. చదువుతున్నాడనీ, లక్ష రూపాయల ఆస్తివుందనీ, పిల్లాడు చక్కనివాడనీ, నారాయణ కుమార్తె చదువూ చక్కదనమూ చూసి సంబంధం చేసుకుంటున్నారనీ, దానికి తోడు నారాయణ నాలుగు వేలు కట్నమిస్తానన్నాడనీ చెప్పుకున్నారు.

ఈకథలో అతిశయోక్తి ఉన్నా అసలు సంగతులు ఊరివారికి ఏలా తెలిసినవా అనే నారాయణకు ఆశ్చర్యమయింది.

ఈ సంబంధం కూడా కొన్నాళ్లు నలిగి చివరకు పెళ్లివారు ఇప్పట్లో మేము మా పిల్లవాడికి పెళ్లిచెయ్య దలచ లేదని కబురు చేశారు.. ఈమాట విని నారాయణ కుప్పన కూలిపోయినాడు.

ఇదివరలో అనేక సంబంధాలు చూడడ మయింది. కొన్ని వీరికి నచ్చక, కొన్నివారికి నచ్చక జతపడలేదు. తర్వాత ఊళ్లో పుకారు ఆయన దాకా వచ్చింది. అందుకనే తాహతు లేకపోయినా బెజవాడ సంబంధానికి నాలుగువేలు కట్నమిస్తానన్నాడు. కాని ఇదికూడా కాకపొయ్యేసరికి ఆ బ్రాహ్మడు నిలువునా నీరయి పోయినాడు.

ఏదో విధంగా ఏ సంబంధమో సంబంధం చూసి ఇహ కూతురి పెళ్లి చెయ్యకపోతే ఇహ కాదేమో అన్నంత భయం వేసింది నారాయణగారికి.

పెళ్లివారు "ఇప్పట్లో పెళ్లిచెయ్యడం లేద"ని పంపిన కబురు మామూలు లాంఛనమేనని అతనికి తెలుసు. వాళ్లు ఎక్కువ కట్నమన్నా ఆశించి ఉండాలి, లేదా ఈఊళ్లో పుకారు వాళ్లకు తెలిసిఅన్నా వుండాలి. ఏదో నిర్ధారణగా తెలుసుకుని కట్నం కావలిస్తే ఇంకోవెయ్యి ఇస్తామనైనా సంబంధం తిరిగి పోకుండా చూసి రావలసిందని కామావధానులను ప్రార్థించాడు నారాయణ.

కామావధానులు నారాయణపడే శ్రమచూసి కాదన లేక బెజవాడ వెళ్లాడు. పెళ్లివారింటికి, పెళ్లివారు సంబంధం మానుకోవడానికి కారణం కనుక్కుందామని శాయశక్తులా ప్రయత్నం చేశాడు. ఎంత వెనుగులాడినా "ఇప్పుడు పిల్లవాడు చేసుకోనంటున్నాడు" అనే మాటతప్ప మరోమాట లేదు. కట్నం ఎరవేశాడు. ఆ మంత్రమూ పారకపోతే కామావధానులు నిస్పృహ చేసుకుని బయలుదేరి వస్తూ పెళ్లికుమారుడి తండ్రి నరసింహం గారిని వీధిలోకి పిలిచి "మీరు ఏలాగూ సంబంధం మానుకున్నారు. మా గ్రహచారము బాగా లేదనుకుంటున్నాను. కాని మీ అనుమానం సెలవిచ్చారా తీర్చగలదయితే తీరుస్తాను. తీర్చలేక పోయినా మీరిలా అన్నాడని నరమానవుడికి తెలియనీయను. చిత్తగించాలి" అన్నాడు.

'అనుమానాలూ లేవు, ఏవీ లేవు; మాకెందుకు లేనిపోంది'

"మీరు మరొకలా తలచ వద్దు. నారాయణగారు పడే శ్రమచూస్తే అందరికీ కళ్లనీళ్లు కారేట్టున్నది. పిల్ల చూద్దామా వజ్రంలాంటిది. చదువులో సరస్వతి. కట్నమా తోచింది ఇస్తున్నాడు. ఆలాంటి విషయంలో సరైన సంబంధం కుదరక పోతే ఎంతకష్టంగా ఉంటుందో ఊహించండి"

"ఆలా కుదరక పోవడంలో ఏదో ఉందని మీరు ఊహించ వచ్చుగా"

"ఎంత ఊహించినా తోచకనే తమతో మనవి చెయ్యడం".

"ఏదోలెండి మనకెందుకు"

"ఆలాకాదు. తమరు అనుగ్రహించాలి"

"నేనన్నది కాదు సుమండి. పిల్ల రజస్వల అయిందనే

పుకారు విని మావాళ్లు ఈ సంబంధం సుతరామూ వద్దం టున్నారు.”

కామావధానులు ఈలాగని ముందే సులభంగా ఊహించినా ఏమీ ఎరగనట్లు “రామ! రామ! ఏమిటీ! ఎంత అపవాదు వేశారండీ?” అన్నాడు.

“మీరు ఆలా అనక ఏలా అంటారులెండి”

“మీ అనుమానం తీసి వెయ్యలేం కదా ఏమంటే ఏలాభంలెండి?”

“సంబంధం అన్నివిధాలా నచ్చింది సుమండీ? కాని ఇది పెద్దచిక్కు. మా పెద్దలు ఒప్పుకోకనే- మా పిల్లాడికి ఈ సంబంధం మానుకోవడం ఏమీ ఇష్టంగా లేదు.”



తరువాత కట్టిపెట్లమీద అపూరాయనే విశ్వనాధమనే ఆయన ఈవిషయం తనకు చెప్పినట్లు వెలిబుచ్చాడు నరసింహంగారు. ఏమయినా ఈవిషయం బుజూవుకు రానీయ వద్దని కూడా చేతిలో చెయ్యి వేయించుకున్నాడు కూడాను. ...పని కామావధానులు ఇంటికిచేరి విషయ... యావత్తూ - పుకారు వేశిన వారిపేరు మినహా - విశదపర్చాడు.

నారాయణకు మతిపోయినట్లయింది.

“ఇహ నీవలన ఈపని కాదుగాని భారం నామీద వెయ్యి. నేను వివాహం చేస్తాను” అన్నాడు కామావధానులు.

“ఏలాచేస్తావు”

“అదే అడగవద్దు. నేను చెప్పినదానికల్లా ఊఁ అనాలి”

“సరే కానీ, నేను ఊఁ అనకమటుకు ఏం చేసే స్థితిలో ఉన్నాను”

“అయితే మీ శాంతను విశ్వనాధం కొడుక్కు ఇవ్వ దలచుకున్నావని నేను రాయబారం చేయబోతున్నాను”

“ఏమిటీ! విశ్వనాధం కొడుక్కా! మతేమన్నా పోయిందా నా ప్రాపిరి ఉండగా ఇవ్వను.”

”ఎందువల్ల”

“ఓ అంటే నా రాదు. ఆబండ వెధవకు నేనివ్వటం? పెళ్లి కాకపోతే బియే చదివించి ఉద్యోగమన్నా చేయిస్తాగాని.

“కబుర్లకేంలే? అక్షరాల నే చెప్పినట్లు ...... తెలిసిందా? ఒక పరమరహస్యం చెబుతాను” అని ఏదో చెప్పి “సరా. ఈలాగా నేను చెప్పినట్లల్లా నీవు వినేటట్లు ఈ షరతుకు ఒప్పుకుంటే ఈ వ్యవహారంలోకి దిగుతాను.”

“ఏదో రగడలోకి దింపేట్టున్నావు. అప్రతిష్ట వస్తే మాత్రము సుతరామూ వద్దు.

“నీ ప్రతిష్టకు నేను హామీ సరా”

నారాయణ ఒప్పుకోక తప్పిందిగాదు.

కామావధానులు సమయంచూసి విశ్వనాధంగారింటికి వెళ్లి ఏదో పనిమీద వచ్చినట్లు నటించి ఒకగంట సేపు బాతాఖానీ సాగించాడు. తరువాత అమిత లౌక్యంగా “విశ్వనాధం! నారాయణ కూతుర్ని చేసుకుంటావా నీకొడుక్కు ఇప్పిస్తాను?” అన్నాడు.

“నాకొడుక్కా”

"అవును"

"నారాయణ కూతుర్ని"

"అంత ఆశ్చర్య పడతావేం నిశ్చయంగా."

"నాకక్కర్లేదు"

"ఆ నీకొడుకు మాటేమయ్యా"

"అదే నేను చెప్పేది. నాకొడుక్కు నేను చేసుకోను"

"ఎందువల్ల"

"నీమాట అతను వింటాడనేనా"

"నీ కదంతా ఎందుకు నేనిప్పిస్తా నన్నాను. నేను ఇస్తావా నీ?"

"మొన్న బెజవాడ వెళ్లావు కాబోలు ఏమయిందేం"

"బెజవాడ ఎవరూ వెళ్లింది? మావద్దకుడు విశ్వపతి ఎరగవూ. అతను లంఘనాలు పడితే చూచిరావడానికి వెళ్లాను. నిన్న నారాయణ అంటేనూ ఇప్పుడు అదేయినా జ్ఞాపకంవచ్చి అన్నాను.

"అతను మనకు ఇవ్వడుగా"

"ఎవరికోస మిస్తాడు? నీకెందుకు నీవు తలఊపు. మిగిలిన కార్యం నేను సాసాయిస్తాను.

"అతని కక్కడా దొరక్కపోతే నేను కనపడ్డానూ! నా కక్కరనే లేదు.

"తెలివి తక్కువవాడా! నాలుగువేలు కట్నమూ, లాంఛనాలూ నీకు చేదయితే నేనేం చేసేది? నీకు ప్రాప్తంలేదు పోనీ.

విశ్వనాథం ఒక్కమాటతో నాలుగువేలను పోగొట్టు కోలేక పోయినాడు. తనకు పదెకరాల కొంద్రఊన్నా తనకొడుక్కు వెండిచెంబులూ పట్టుబట్టలూ ఇచ్చే సంబంధం దొరకడమే కష్టం. అందువల్ల అతను లాంఛనానికి బెట్టు సరిచేసినా చివరకు సరేనన్నాడు.

నాలుగు రోజులకు లగ్గాలు పెట్టుకున్నారు. ఈమాట విని "ఏదో ఒక సంబంధం లే" అని ఇంట్లో అందరూ సరిపెట్టుకున్నారు గాని శాంత మాత్రం అన్నం మానుకుంది. తండ్రి ఆ అమ్మాయికి ఒక పరమ రహస్యంచెప్పి అన్నం తినిపించాడు.

లగ్గం నాలుగు రోజులుందనగా పెళ్లికుమార్తెవారి వారి తరఫున కామావధానులూ, పెళ్లికుమారుడి తరఫున విశ్వనాథమూ బెజవాడకు వస్తువులూ, బట్టలూ కొనడానికి వెళ్లారు. కామావధానులు గవర్నరుపేట వెళ్లు దామంటే విశ్వనాథం ఏమయినా సరే తాను పాత ఊళ్లోకి వెళ్లక తప్పదన్నాడు. మరీ మూర్ఖిస్తే కామావధానులు ఏమనుకుంటాడోనని చివరకు సరేనన్నాడు. తీరా బస నరసింహంగారున్న ఇంటిదగ్గరేనని తేలిన తర్వాత విశ్వనాథంలో పెద్దమార్పు కనిపించింది కామావధానులకు. అతను మళ్లీ మొదలుపెట్టాడు ఊళ్లోకి వెళ్లకపోతే ఎవరికో కోపంవస్తుందని కామావధానులే బలవంతానా ఆపాడు.

మరునటిరోజున ఇద్దరూ బజారుకు పోతూఉంటే నరసింహంగారు ఎదురు పడనే పడ్డారు. కామావధానులు ఏమీ ఎరగనట్టు విశ్వనాథం ముఖం ఓరకంట పరికిస్తూ నడుస్తున్నాడు. నరసింహంగారే పలకరించాడు. విశ్వనాథం తప్పించుకుందామని మరొకవైపు చూస్తూ నడిచినా అగక తప్పిందిగాదు. నరసింహంగారు "ఏమండోయ్" పవి మీద దయచేశారు అన్నాడు.

"ఓహోమీరా! నేను చూడనేలేదు" అన్నాడు విశ్వనాథం.

"ఏమీ లేదండి. నారాయణ కూతుర్ని విశ్వనాథం కొడుక్కు ఇవ్వాలనని లగ్గాలు పెట్టుకున్నారు. వీవో కావలసి వచ్చాం" అన్నాడు కామావధానులు.

విశ్వనాథం ముఖంలో కత్తివాటు వేసినా నెత్తురు చుక్కలేదు. నరసింహంగారు ఆశ్చర్యమే మూర్తీభవించి నట్లుగా నుంచున్నాడు. తరవాత సెలవు పుచ్చుకుని ఎవరి దారిన వారు వెళ్లారు.

అప్పటినుంచీ విశ్వనాథం మనస్సు మనస్సులో లేదు. "ఇది కామావధానులు కల్పించిన సమావేశమా లేక తాత్కాలికంగా జరిగిందా?" అనేదే ఆయన ప్రశ్న. ఆయన మనస్సు అమిత ఆందోళనకు లోనయింది. కష్టం

బాద సముదాయించుకుని ఏమీ లేనట్టు ప్రవర్తించడానికి ప్రయత్నించాడు.

భోజనాలయి విశ్వనాథం పడుకుంటే కామావధానులు నరసింహంగారున్న వీధిన పని ఉన్నవాడిలాగ చరా చరా పది పది హేనుసార్లు తిరిగాడు. చిట్ట చివరకు నరసింహంగారు వసారాలో నుంచొని ఈయన్ను చూడడం జరిగింది. వెంటనే పిలిచాడాయన. ఈయన వెళ్ళగానే నరసింహంగారు.

"విశేషాలు ఏమిటి?" అన్నాడు.

"ఏమున్నయ్యండి. ఈ వీధి చివర కొంచెం పనుంది..."

"తమాషా చేశారే"

"ఏ విషయం"

"అసాధ్యులు నేననే మాట మీకు తెలియకం లేదంటారా"

"లేదు అనను లెండి. ఎక్కడా సంబంధం కుదరక పోతే విశ్వనాథం కొడుక్కి ఇవ్వమని నేనే ప్రోద్బలం చేసి కుదిర్చాను"

"ఆయన ఏలా ఒప్పుకున్నాడు"

"మనకేం తెలుస్తుంది"

"మరేవేవో చెప్పాడే నాతో"

"ఆవిషయాలు నేనేం చెప్పేది చెప్పండి"

"నాకు పనికిరాదన్న పిల్ల విశ్వనాథంగారి కెలా పనికి వచ్చిందండీ"

"............................"

"మీకుగాని, నారాయణగారికిగాని ఏమీ అభ్యంతరం లేకపోతే మేమే చేసుకుంటాం ఆపిల్లని, ఏమంటారు"

"అంతా సిద్ధమయి పోయింది"

"మాదీ సిధమయిందేగా మరి! ఈయనవల్ల నేగా తప్పిపోయిందీ? ఆలోచించండి.

"ఏమోలెండి! నారాయణను ఇహ శ్రమ పెట్టకండి. రెండువేలు కట్నమూ, లాంఛనాలూ సంబంధం కుదిరిన తర్వాతా కొంత లాయిలాసాపడ్డ తర్వాతా తిరిగీ విశ్వనాథం కు తట్టుకోలేడేమో"

"పేచీలు పెట్టకండి. మీరు చెప్పితే ఆయన వినకేం. కట్నం విషయంలో మీరు చెప్పినట్లు పోతాం. ఇంతని అడగడం ఎప్పడూ లేదు మాయింట. ఇంతకూ నాథంగారు చేసినపనికి నాకు ఒళ్లు మండిపోతూ ఉంది. ఈలాంటి పిల్ల తప్పిపోయిందని ఎంతకష్టంగా ఉన్నదనుకున్నా రేమిటి? లేవండి. సరేన్నవండి. వెళ్లుదాము.

కామావధానులూ, విశ్వనాథం ఇంటికి వచ్చినవాటి రాత్రి నరసింహంగారు ఆవూరువచ్చి మూడువేలు కట్నం లాంఛనాలతో నారాయణగారి సంబంధం కుదుర్చి లగ్గాలు పెట్టుకొని వెళ్లాడు.

అంతా తెలిసిం తర్వాత తనకొడుకు వివాహాలన్నీ తప్పించినందుకూ నావాహంగామా చేసి విశ్వనాథం నారాయణనూ, కామావధానులనూ నలుగురిలోకి రప్పించి నప్పటికీ విషయం యావత్తూ చెప్పినమీదట అందరూ అతన్నే చివాట్లు పెట్టారు. కథ అడ్డంగా తిరిగిందని విశ్వనాథం తలవంచుకున్నాడు.

వివాహం సలక్షణంగా జరిగింతర్వాత జరిగిన సంగతి యావత్తూ నారాయణ అందరికీ చెప్పాడు. ఆయన కామావధానులతో "అంతా బాగానే ఉంది గాని మీరు కలిసి వెళ్లుతుండగా నరసింహం బావగారు కనపడకపోతే ఏమయ్యేది?" అన్నాడు.

"ఏమో ఏమయ్యేదో? నేనూ దేవుడిమీదనే భారం వేసి బయలుదేరాను ఆరోజున అయితే ఏదో పేరుతో విశ్వనాథాన్ని వెంటవేసుకుని నరసింహంగారి వీధిన పదిసారులయినా తిరుగాదామనే అనుకున్నాను. మన అదృష్టం కొద్దీ ఆయనే కనపడ్డాడు. ఆ తరువాత కూడా నా అంతట నేను వారింటికి వెళ్లకుండా ఏదో పనిఉన్నట్టు చరాచరా ఆవీధిన పదిసార్లు తిరిగి బెట్టుసరిగా ఆయన పిలిస్తేనే వెళ్లి ఆయనే బలవంతం చేసేటట్టు చేశాను." అని కామావధానులు సమాధానం చెప్పాడు.

బంగారంలాంటి సంబంధం - తిరిగి కుదిర్చినందుకూ వెయ్యి కష్టం తగ్గించినందుకూ కామావధానులను ఎప్పుడూ పొగడుతూ ఉండేవాడు నారాయణ.

---